ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
ఆదివారం 26 జనవరి 2025





విద్యుత్ వెలుగుల్లో కలెక్టర్ కార్యాలయం

గణతంత్ర వేడుకలకు సిద్ధం

- జిల్లాకేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పార్వతీపురం/బెలగాం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలకు జిల్లాకేంద్రం ముస్తాబైంది. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేదికతో పాటు ఆ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మరోవైపు కలెక్టర్ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కాగా ఆదివారం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. పోలీస్ దళాల వందనాన్ని స్వీకరిస్తారు. అనంతరం జిల్లా ప్రగతిని వివరించనున్నారు. పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు , శకటాలు, ప్రదర్శన శాలలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 487 మందికి ప్రశంసాపత్రాలు అందించనున్నారు. జేసీ శోభిక, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాత్సవ, యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏఎస్పీ దిలీప్‌కిరణ్, డీసీ హెచ్‌వో వాగ్దేవి, డ్వామా పీడీ రామచంద్రరావు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, ఏఏవో ప్రసాద్ తదితరులు జ్ఞాపికలు అందుకోనున్నారు. కార్యక్రమంలో ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొనున్నారు.



గణతంత్ర దినోత్సవానికి ముస్తాబైన జూనియర్ కళాశాల మైదానం

శంబర జాతరకు వేళాయే



- రేపు తొలేళ్లు.. 28న సిరిమానోత్సవం
- ఆలయ పరిసరాల్లో పక్కాగా ఏర్పాట్లు
- భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక సర్వీసులు
- పర్యవేక్షించిన మంత్రి సంధ్యారాణి
- విజయవంతం చేయాలని పిలుపు



ఆలయం వద్ద క్యూలైన్లు ఇలా..



పూజలకు సిద్ధమైన పోలమాంబ చదురు గుడి

మక్కువ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల కొంగు బంగారం, కోర్కెల తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ సంబరానికి వేళయ్యింది. ఈనెల 27, 28, 29న జాతర జరగనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం తొలేళ్ల, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అంపకోత్సవం నిర్వహించనున్నారు. కాగా సిరిమానోత్సవానికి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా సర్వం సిద్ధం చేశారు. కాగా జాతర ఏర్పాట్లను శనివారం మంత్రి సంధ్యారాణి పర్యవేక్షించారు. ముందుగా వనంగుడి వద్ద అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. గ్రామ పెద్దలు, దేవాదాయశాఖ సిబ్బంది పక్కా ప్రణాళికతో వ్యవహరించి జాతరను విజయవంతం చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. చదురుగుడి, వనంగుడి క్యూలైన్‌ల వద్ద చలువ పందిళ్లను ఏర్పాటు చేశామని ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. ఉచిత దర్శనంతో పాటు రూ.20, రూ.100 ప్రత్యేక, శీఘ్ర దర్శనాలకు క్యూలైన్లు సిద్ధం చేశామన్నారు. పోలీస్‌శాఖ సహకారంతో గర్భిణులు, వృద్ధులకు అమ్మవారి దర్శనం వేగవంతమయ్యేలా చర్యలు చేపడతామని చెప్పారు. భక్తులకు ఉచిత ప్రసాదం అందిస్తామన్నారు. గతంలో శంబర జాతరకు వచ్చే వారికి కొన్ని ఇబ్బందులు ఎదరయ్యాయని, అందుకే 50 సీసీ కెమెరాలతో ఆలయ పరిసరాలను పర్యవేక్షిస్తామని తెలిపారు. సిరిమాను తిరిగే ప్రదేశంలో రూ.రెండు కోట్లతో విశాలంగా రహదారులు నిర్మించడంతో ఈ సారి అమ్మవారి దర్శనానికి ఏ ఇబ్బందులు ఉండవన్నారు.

శరవేగంగా...

పోలమాంబ చదురుగుడి, వనంగుడి ఆలయాల వద్ద కేశఖండనశాల, తాత్కాలిక మరుగుదొడ్లు, వస్త్రాలు మార్చే గదుల నిర్మాణాలు వేగవంతమవుతున్నాయి. లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేస్తున్నారు. మరోవైపు పార్వతీపురం ఏఎస్పీ ఓ.దిలీప్‌కుమార్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. సాలూరు మండలం కందులపదం పొలిమేరలో గుర్తించిన సిరిమానును కొండదొరలు సంప్రదాయం ప్రకారం ఆదివారం గ్రామానికి తీసుకురానున్నారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పూజారి సిరిమానును అధిరోహిస్తారు.

వంద ఆర్టీసీ బస్సులు..

సాలూరు రూరల్: శంబర పోలమాంబ జాతరకు ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వంద బస్సులను నడపడానికి ఆర్టీసీ కార్యాచరణ సిద్ధం చేసింది. సిరిమానోత్సవం రోజున (ఈ నెల 28న) వంద బస్సులను ఆర్టీసీ నడపనుంది. భక్తుల రద్దీ దృష్ట్యా ఈ నెల 28న సాలూరు, పార్వతీపురం డిపోల నుంచి శంబరకు 25 చొప్పున బస్సులను నడపనున్నారు. విజయనగరం డిపో నుంచి 20, ఎస్.కోట, పాలకొండ, శ్రీకాకుళం-2 డిపోల నుంచి పదేసి చొప్పున ఆర్టీసీ బస్సులను నడపనున్నారు. తొలేళ్ల సందర్భంగా 27న సాలూరు డిపో నుంచి పది, పార్వతీపురం డిపో నుంచి ఐదు బస్సులను నడపనున్నారు. అంపకోత్సవం రోజైన 29న సైతం ఇదే విధంగా బస్సులను నడపనున్నారు. 'సిరిమానోత్సవానికి సాలూరుతో సహా వివిధ డిపోల నుంచి వంద బస్సులు నడపడానికి కార్యాచరణ సిద్ధం చేశాం. భక్తుల రద్దీ అధికంగా ఉంటే అప్పటికప్పుడు మరికొన్ని సర్వీసులను అందుబాటులోకి తెస్తాం.' అని సాలూరు డిపో మేనేజర్ భాస్కరరెడ్డి తెలిపారు.



సాలూరు మండలం కందులపదంలో సిరిమానును గుర్తించిన గ్రామస్థులు

బాలికల హక్కులను

పరిరక్షించాలి

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి



సైకిళ్ల పంపిణీలో మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బాలికల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మహిళాభి వృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం పార్వతీపురంలోని లయన్స్ కల్యాణ మండపంలో బేటీ బచావో...బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఆడబిడ్డ అంటే భారం కాదని.. బలమైన ధైర్యవంతురాలని తెలిపారు. బాలికలు బాగా చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లాలో బాలికల వసతిగృహం, పాఠశాలల్లో తాగునీటి వసతితో పాటు మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వన్‌స్టాప్ సెంటర్, బాలసదన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 220 మంది అనాథ పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున సామాజిక పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థినులకు ల్యాప్‌టాప్, అనాథ పిల్లలకు ఆర్థిక సాయం, గర్భిణులు, బాలింతలకు అమృత ఆహార కిట్లు పంపిణీ చేశారు. బేటీ బచావో...బేటీ పడావో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సామూహిక సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అన్న ప్రసాదం అందించారు.

- ఆ తర్వాత ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తదితరులతో కలిసి మంత్రి సైకిల్ తొక్కి అందర్నీ ఉత్సాహ పరిచారు. అమ్మాయిలను బాగా చదివించి ఉన్నత శిఖరాలు చేరుకునేలా ప్రోత్సహించాలని ప్రభుత్వ విప్ జగదీశ్వరి సూచించారు. మహిళా శక్తిని మరింత పెంపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు కలెక్టర్ చెప్పారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ.. ఆడపిల్లలకు చదువు తప్పనిసరి అని తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి టి.కనకదుర్గ, స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజనల్ డైరెక్టర్ చిన్మయదేవి, ట్రైకార్, కాపు, కొప్పల వెలమ కార్పొరేషన్ సంచాలకులు లావణ్య, రామినాయుడు, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చేదెప్పుడు?

- అధ్వానంగా బొబ్బిలి-పార్వతీపురం రహదారి
- తరచూ ప్రమాదాలు

8లో

పాఠశాల బస్సుల్లో అగ్నిప్రమాద నివారణ యంత్రాలు తప్పనిసరి

- ఇన్‌చార్జి జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి శశికుమార్

8లో

ఆర్టీసీ బలోపేతానికి పక్కా ప్రణాళిక

- జోనల్ చైర్మన్ దున్నుదొర

బొబ్బిలి ఎమ్మెల్యేపై లోకాయుక్తకు ఫిర్యాదు

- ల్యాండ్ సీలింగ్ భూములు తీసుకున్నారని ఆరోపణ

9లో

పటిష్ఠ ప్రజాస్వామ్యానికి ఓటు కీలకం: కలెక్టర్

పార్వతీపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పటిష్ఠ ప్రజాస్వామ్య నిర్మాణానికి ఓటు ఎంతో కీలకమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం పార్వతీపురంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ' ఓటు హక్కు కాదు..మన బాధ్యత కూడా... నిజాయితీగా ఓటు వేయండి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.' అంటూ విద్యార్థులు ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటు హక్కు అనే ఆయుధాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో 7,81,898 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఉన్నత విద్య కోసం వేరే ప్రాంతాలకు వెళ్లేవారు సైతం ఓటరుగా నమోదు కావాలని సూచించారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సత్కరించారు. యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు అందించారు. క్విజ్, వ్యాసరచన, డిబేట్, చిత్రలేఖనం వంటి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, సమర్థవంతంగా పనిచేసిన బీఎల్‌వోలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఇన్‌చార్జిలతో ఇంకెన్నాళ్లు?

- వేధిస్తున్న తహసీల్దార్ల కొరత
- ప్రజలకు పూర్తిస్థాయిలో అందని సేవలు

పార్వతీపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తహసీల్దార్ల కొరత నెలకొంది. కొన్నేళ్లుగా ఈ సమస్య వేధిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తుండడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి మండలానికి కచ్చితంగా తహసీల్దార్ ఉండాలి. కానీ జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇక్కడా పరిస్థితి లేదు. క్షేత్రస్థాయి సిబ్బందికి ఆ బాధ్యతలు అప్పగిస్తుండడంతో వారు సక్రమంగా పనిచేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా మండలాల్లో రెవెన్యూ సమస్యలు కొలిక్కిరావడం లేనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 15 మండలాలు ఉన్నాయి. ఇందులో ఐదు మండలాలకు పూర్తిస్థాయి తహసీల్దార్లు లేరు. కొమరాడ, బలిజిపేటకు ఇన్‌చార్జి తహసీల్దార్లుగా అక్కడి హెచ్‌డీటీలు కె.శివయ్య, కె.రత్నకుమారి వ్యవహరిస్తున్నారు. మక్కువ, జియ్యమ్మవలస, వీరఘట్టం మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆయా చోట్ల ఉన్న హెచ్‌డీటీలు షేక్ ఇబ్రహీం, ఆర్.ఫకీరు, సి.హెచ్.సత్యనారాయణ తహసీల్దార్లుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇన్‌చార్జిల పాలనతో ప్రజలకు పూర్తిస్థాయిలో రెవెన్యూ సేవలు అందడం లేదు. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించి తగు చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.



బలిజిపేట తహసీల్దార్ కార్యాలయం

సాగునీటికి ఎదురుచూపు

గరుగుబిల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని రైతులు రబీ పంటలకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో సాగునీటి విడుదల ప్రకటన కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వాస్తవంగా ప్రాజెక్టు ఎడమ కాలువ పరిధిలో సుమారు 60 వేల ఎకరాల వరకు భూములున్నాయి. గరుగుబిల్లి, వంగర, పాలకొండ, జియ్యమ్మవలస, వీరఘట్టం, కొత్తూరు మండలాలకు చెందిన రైతులు పెరస, మినుప, నువ్వులు, వేరుశనగ, కొంత విస్తీర్ణంలో వరి, ఆరుతడి పంటల సాగుకు సమాయాత్తమవుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో 20 శాతానికి మించి ఆధునికీకరణ పనులు జరగలేదు. మరోవైపు కాలువ పరిధిలో అధికంగా గండ్లు పడడంతో గత ఏడాది ఖరీఫ్‌లో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్పందించి సకాలంలో సాగునీటిని విడుదల చేస్తే.. రబీ పంటలతో ఖరీఫ్ నష్టాల నుంచి బయటపడొచ్చనే యోచనలో రైతులున్నారు. దీనిపై ఇప్పటికే తోటపల్లి ఆయకట్టు పరిధిలోని నీటి సంఘాల ప్రతినిధులు జిల్లా అధికారులకు వినతులు అందించారు. సాగునీటి సరఫరాతో పాటు కాలువ పరిధిలో మరమ్మతు పనులు కూడా చేపట్టాలని విన్నవించారు. కురుపాం, పాలకొండ శాసనసభ్యులు కూడా చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.



సాగునీరు సరఫరా చేయాల్సిన ఎడమ ప్రధాన కాలువ ఇలా..

ఓటు విలువ తెలుసుకో

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా ఓటరు దినోత్సవం
- విద్యార్థులతో అవగాహన ర్యాలీలు
- సీనియర్ ఓటర్లకు సన్మానం

జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీలు చేశారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలని నినాదాలు చేశారు. ఓటు వజ్రాయుధం అని చాటిచెప్పారు. పలుచోట్ల సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



బొబ్బిలి: ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో రామ్మోహనరావు



పాలకొండ: ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్యాంబాబు


గజపతినగరం: బాలికల ఉన్నత పాఠశాలలో 25 ఆకారంలో..


శృంగవరపుకోట: వేపాడ సాంఘిక సంక్షేమ గురుకుల వసతి గృహ విద్యార్థినుల థింసా నృత్యం



చీపురుపల్లి: మూడు రోడ్ల కూడలిలో మానవహారం

ఆర్టీసీ బలోపేతానికి పక్కా ప్రణాళిక

- జోనల్ చైర్మన్ దున్నుదొర

రామభద్రపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని బలోపేతం చేయడానికి పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నామని ఆర్టీసీ జోనల్ చైర్మన్, టీడీపీ అరకు నియోజకవర్గం ఇన్‌చార్జి సియ్యారి దున్నుదొర తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతి బస్సు డిపోకు 5 కొత్త బస్సులు కేటాయించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జోనల్ పరిధిలో ఉన్న అన్ని డిపోల్లోనూ సమీక్షలు జరిపి సమస్యలను కూడా గుర్తిస్తామని చెప్పారు. సంక్రాంతి పండగలో జోనల్ పరిధిలో సుమారు రూ.4కోట్ల 50లక్షలు ప్రయాణికుల ద్వారా ఆదాయం వచ్చిందని, గతంలో కంటే ఇది రెట్టింపు సంఖ్యలో వచ్చిందని చెప్పారు. అలాగే జోనల్ పరిధిలో 165 స్క్రాబ్ బస్సులు ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో, బస్సులు ఆగిపోయే రూట్లలో పల్లె వెలుగు బస్సులు నడపనున్నామని చెప్పారు. అద్దె బస్సుల డ్రైవర్లకు మరింత శిక్షణనిచ్చి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నిరోధించడానికి చర్యలు చేపడతామన్నారు. శంబరకు ఎక్కువ బస్సులు నడపనున్నామని దీనిపై ఇప్పటికే ఆర్టీసీ ఉన్నతాధికారులు దృష్టి సారించారని తెలిపారు. అలాగే రామభద్రపురం మండలం ఎనుబరువు గిరిజన గ్రామానికి సాలూరు డిపో నుంచి పాచిపెంట మీదుగా మళ్లీ బస్సు సౌకర్యం పునరుద్ధరిస్తామని చెప్పారు. దీనిపై సంబంధిత ఆర్టీసీ అధికారులతో మాట్లాడనున్నామని అన్నారు. ● గత ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఒక్కొక్కటి అమలు చేస్తున్నామన్నారు.

ఎట్టకేలకు రహదారులకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మక్కువ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ అమ్మవారి జాతర నెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు పట్టణాల నుంచి మండల కేంద్రం మక్కువ మీదుగా శంబర చేరుకునే రహదారులు అధ్వాన్నంగా ఉండడంపై ఇటీవల ఆంధ్ర జ్యోతిలో 'శంబర జాతరకు దారేది' పేరిట వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. చినబోగిలి, బొబ్బిలి, సాలూరు రహదారులకు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారు.

బస్సుల్లో అగ్నిప్రమాద నివారణ యంత్రాలు ఉండాలి

బెలగాం, 25 జనవరి (ఆంధ్రజ్యోతి): ప్రతి పాఠశాల బస్సులో తప్పని సరిగా అగ్ని ప్రమాదాలను నివారించే యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని ఇన్‌చార్జి జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎం.శశికుమార్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా ప్రజా రవాణా శాఖా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్యాస్, ఎలక్ట్రికల్ వాహనాల్లో, బస్సుల్లో జరిగే అగ్ని ప్రమాదాల నుంచి ఎలా రక్షించుకోవాలి, మంటలను ఎలా అదుపు చేయ్యాలి అనేదానిపై అవగాహన కల్పించారు. సుమారు 350 మంది డ్రైవర్లకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఎంవీఐలు జి.సత్యనారాయణ, ఎన్.రమేష్, బి.కాశీరాం నాయక్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో అక్రమాలపై దర్యాప్తు చేపట్టండి

జియ్యమ్మవలస, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉపాధి పనులు చేసిన ప్రాంతంలో బోర్డులు ఏర్పాటు చేసేందుకు రూ.42.66 లక్షలు కేటాయించారని చెప్పారు. అయితే బోర్డులు ఏర్పాటు చేయకుండానే సుమారు రూ.8.10 లక్షలు తినేసినట్లు రికార్డులు చెబుతున్నాయన్నారు. వీటిపై దర్యాప్తు జరిపించి, అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి కె.సీతారాం, కమిటీ సభ్యుడు బి.మోహన్‌రావు ఉన్నారు.

మెట్టవలసలో భూముల రీ సర్వే

బొబ్బిలి రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మెట్టవలస గ్రామంలో శనివారం డీఐవో నారాయణరావు ఆధ్వర్యంలో భూముల రీ సర్వే ప్రక్రియను ప్రారంభించారు. జి.సుగుణశీలరావుకు చెందిన భూమిని రీ సర్వే చేశారు. ఈసందర్భంగా డీఐవో మాట్లాడుతూ ఆర్ఎస్ఆర్ ప్రకారం కొలతలు తీసి సరిహద్దులు ఏర్పాటు చేసి, రైతు పేరు, సర్వే నెంబరు, విస్తీర్ణం, ఖాతా, హద్దుల గుర్తింపు ఏర్పాటులో ఎలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తగా పనిచేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశాంచారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ శివుడునాయుడు, ఎంఎస్ సతీష్, సర్పంచ్ మాధవరావు, వైస్ ఎంపీపీ శంకరరావు, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయరు, రైతులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఎస్ఈగా అప్పారావు

బొబ్బిలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీరుగా ఆర్.అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డీఈఈలు, ఏఈలు, కార్యాలయం సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జంఝావతి ప్రాజెక్టు పనులతో పాటు పలు పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. అన్ని రకాల ఇరిగేషన్ పనులపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత వాటిపై తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పీసా కమిటీలకు బాధ్యతలు అప్పగించాలి

సీతంపేట రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పీసా గ్రామ సభల్లో ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన కమిటీలకు ఇంత వరకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించలేదని ఏజేఏసీ నాయకుడు బి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన పీసా కమిటీ సభ్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసా కమిటీకి పూర్తిస్థాయి అధికారాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సదస్సులో జేఏసీ నాయకులు బి.ఉమామహేశ్వరరావు, రామస్వామి, రామ్మోహనరావు, చంటి తదితరులు పాల్గొన్నారు.

పాలవలస కుటుంబానికి మాజీ మంత్రుల పరామర్శ

పాలకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు పాలవలస రాజశేఖరం సంతాప దినం శనివారం పాలకొండలోని ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు, విశ్వాసరాయి కళావతి తదితరులు పాలవలస కుటుంబాన్ని పరామర్శించారు. రాజశేఖరం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పాలవలస కుటుంబీకులు విక్రాంత్, రెడ్డి శాంతికి ధైర్యం చెప్పారు.

గుంతలు పూడ్చేదెప్పుడు?

- అధ్వానంగా బొబ్బిలి-పార్వతీపురం రహదారి

బొబ్బిలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి-పార్వతీపురం ప్రధాన రహదారిలో స్థానిక సాయినగర్ సమీపంలో రోడ్డు మధ్యలో ఓ పెద్ద గుంత పడింది. దీనిని పూడ్చకపోవడంతో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. స్థానికులు ఈ గుంతలో ఓ సిమెంట్ రేకు ముక్కను నిలబెట్టి అందరికీ హెచ్చరిక చేస్తున్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి ప్రమాదం

స్థానిక సాయిగర్‌కు చెందిన ఆరోగ్యశాఖ రిటైర్డ్ ఉద్యోగి జయకుమార్ ఈ రహదారిపై బైక్‌పై వస్తుండగా ఇక్కడ ఉన్న గుంతను గమనించక శుక్రవారం రాత్రి ప్రమాదానికి గురయ్యారు. ఆయన చేయి విరిగిపోవడంతో ప్రస్తుతం విశాఖ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

తరచూ ప్రమాదాలు

ఇక్కడ నుంచి పాతబొబ్బిలి వరకు గల రహదారి చాలా అధ్వాన్నంగా ఉంది. ప్రతిరోజూ అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే మెట్టవలస దాటి గొర్లెసీతారామపురం మీదుగా రామభద్రపురం వరకు గల రాష్ట్రీయ రహదారి కూడా చాలా అధ్వానంగా ఉం ది. వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

పూర్తి కాని పనులు

సంక్రాంతి నాటికి రోడ్లపై గుంతలు కప్పేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పుకొచ్చింది. కానీ జనవరి నెల చివరికి వస్తున్నా ఎటువంటి పనులు పూర్తి కాలేదని, గుంతలు పూడ్చేదెప్పుడని ప్రజలు అసంహనం వ్యక్తం చేస్తున్నారు.


రహదారి మధ్యలో ఏర్పడిన గోతిలో రేకు పెట్టిన దృశ్యం

స్ఫూర్తినిచ్చే చిత్రం..



బెలగాం, 25 జనవరి (ఆంధ్రజ్యోతి): ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు టి.రవికుమార్ చిత్రపటాన్ని తయారు చేశారు. ఈ చిత్రపటాన్ని శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్‌కు అందజేశారు. ఆ చిత్రం ఓటర్లకు స్ఫూర్తినిస్తుందని, కలెక్టర్.. రవికుమార్‌ను అభినందించారు. డీఆర్వో హేమలత, రెడ్‌క్రాస్ చైర్మన్ మంచిపల్లి శ్రీరాములు పాల్గొన్నారు.

ఐటీడీఏలో అవార్డుల పంట

సీతంపేట రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏలో అవార్డుల పంట పండనుంది. ఆదివారం సీతంపేట ఐటీడీఏలో నిర్వహించనున్న రిపబ్లిక్ వేడుకల్లో ఐటీడీఏ పరిధిలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు 500 మందికి అవార్డులు అందజేయనున్నారు. మరో ఏడుగురు కూడా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.

ఆదివాసీ సాంస్కృతిక మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పాలకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో ట్రైబుల్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆదివాసీ సాంస్కృతిక మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ పోస్టర్‌ను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శనివారం పాలకొండలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైబుల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్పనాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణునాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.భగవాన్ తదితరులు ఉన్నారు.

● సీతంపేట రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో రాజమండ్రిలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఆదివాసీ సాంస్కృతిక మహోత్సవాల పోస్టర్‌ను ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర తదితరులు పాల్గొన్నారు.


పాలకొండ: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సైన్స్ ఫెయిర్‌లో తలవరం విద్యార్థుల ప్రతిభ

వీరఘట్టం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తలవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పుదుచ్చేరిలో ఈనెల 20 నుంచి 25 వరకు జరిగిన సాధరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు రామారావు మార్గదర్శకత్వంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు నితిన్‌కుమార్, గోవిందరావు తయారు చేసిన మోటార్ లేని నీటి పంపు అనే ప్రాజెక్టు రెండో స్థానాన్ని సాధించింది. ఈ మేరకు పుదుచ్చేరి స్పీకర్, విద్యా శాఖా మంత్రులు చేతుల మీదుగా ట్రోఫీ, ఐదు వేల నగదు బహుమతి అందుకున్నారు. విద్యార్థులను డీఈవో తిరుపతినాయుడు, పాలకొండ ఉప విద్యాశాఖాధికారి పి.కృష్ణమూర్తి, ఎంఈవోలు గౌరునాయుడు, ఆనందరావు అభినందించారు.

క్విజ్ పోటీల్లో సీతానగరం విద్యార్థులు..

సీతానగరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల దినోత్సం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో సీతానగరం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభకనపర్చారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ చేతులమీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారు.

సూర్యారావుకు 'భారత సేవాద్రష్ట'

గరుగుబిల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పెంటపాటి సూర్యారావు చేసిన సేవలకు గాను విశాఖపట్నానికి చెందిన టీవీ టూరిజం సంస్థ భారత సేవాద్రష్ట అవార్డును ప్రదానం చేసింది. ఈ మేరకు శనివారం విశాఖపట్నం దస్పల్లా హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును అందజేశారు. ఈసందర్భంగా వినియోగదారుల సంఘ సభ్యులు నల్ల మధుసూదనరావు, మాన్యం రామకృష్ణ గొర్లి అప్పలరాజు, మేడిశెట్టి ఈశ్వరరావు, వారణాశి శ్రీహరిరావు, ఊర్మిళమ్మ అభినందనలు తెలిపారు.

పథకాలపై సమాచారం ఇవ్వకపోతే ఎలా?

- ఆగ్రహం వ్యక్తం చేసిన గుమ్మలక్ష్మీపురం ఎంపీపీ
- రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

గుమ్మలక్ష్మీపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితర ప్రజా ప్రతినిధులకు అధికారులు తెలియజేయడం లేదని ఎంపీపీ దీనమయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అభివృద్ధి పనులను ఎందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇదే పరిస్థితి భవిష్యత్తులో కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్ గౌరీ శంకరరావు మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సకాలంలో గౌరవ వేతనం ఇవ్వడం లేదన్నారు. విద్య, వైద్యం రహదారులు, తాగునీరు తదితర సమస్యలను ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సాల్మన్‌రాజు, జడ్పీటీసీ రాధిక, మండల ఉపాధ్యక్షుడు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం అందించడం లేదు

భామిని, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై ప్రజాప్రతినిధులకు సమాచారం అందించడం లేదని మండల సమావేశంలో సభ్యులు మండిపడ్డారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తోట శాంతకుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులపై చర్చించగా కీసర ఎంపీటీసీ ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ వేతనదారులకు తెలియకుండా మేట్‌ను నిర్ణయించడం సరి కాదన్నారు. గ్రామాల్లో పని మంజూరైతే కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదని బాలేరు ఎంపీటీసీ చంద్రశేఖర్ అన్నారు. దీనికి ఏపీవో తులసీదాస్ స్పందిస్తూ మేట్ల నిర్ణయం ఫీల్డ్ అసిస్టెంట్ల మీద ఆధారపడి పడి ఉంటుందన్నారు. ఉపాధి పనుల్లో అవసరం ఉంటే సర్పంచ్‌ల అనుమతి తీసుకుంటున్నామని బదులిచ్చారు. పశు సంరక్షణ శాఖపై చర్చించగా పార్టీలకు అతీతంగా గోశాలలు మంజూరు చేస్తామని దరఖాస్తు చేసినా ఫలితం లేదని బాలేరు ఎంపీటీసీ చంద్రశేఖర్ ప్రశ్నించారు. దీనిపై పశు వైద్యాధికారి సంతోష్‌కుమార్ స్పందిస్తూ ఆ జాబితా మొత్తం అందజేస్తామని చెప్పారు. తప్పిపోయిన ఇళ్ల లబ్ధిదారులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కీసర ఎంపీటీసీ ఎం.మోహన్‌రావు.. హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్‌ను కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జలజీవన్‌మిషన్ పనుల్లోనే నిమగ్నమై పంచాయతీ పనులు ఎంబుక్‌లో నమోదులో నిర్లక్ష్యం చేస్తున్నారని సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.


భామిని: సమావేశంలో ఉపాధి హామీపై వివరిస్తున్న ఏపీవో

హమాలీల కూలి రేట్లు పెంచాలి

బొబ్బిలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికులు కూలి రేట్లు పెంచాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ముల్లు నరిసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక సివిల్ సప్లయీస్ గోదాం ముందు ధర్నా నిర్వహించారు. కూలి రేట్లకు సంబంధించిన జీవోను ప్రభుత్వం జారీ చేయాలని డిమాండ్ చేశారు. జట్టు మేస్త్రీలు పాల్గొన్నారు.

సాలూరు ఎంపీడీవో బదిలీ

సాలూరు రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సాలూరు ఎంపీడీవో ఎ.రమాదేవి పార్వతీపురం డ్వామా ఏపీడీగా బదిలీ అయ్యారు. ఎన్నికల అనంతరం సాలూరు ఎంపీడీవోగా విజయ నగరం నుంచి ఆమె బదిలీపై వచ్చారు. ఆమె డ్వామా ఏపీడీగా బదిలీ కావడంతో ఏవో గొల్లపల్లి పార్వతికి ఎంపీడీవోగా ఎఫ్ఏసీ బాధ్యతలిచ్చారు.

న్యూస్ బాక్స్

ఎన్నికల నిర్వహణలో ప్రతిభ



అవార్డు అందుకుంటున్న శివన్నారాయణ

గుమ్మలక్ష్మీపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్ శివన్నారాయణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మంజూరు చేసిన అవార్డుకు ఎంపికయ్యారు. ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడలో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ చేతులమీదుగా ఈ అవార్డు అందుకున్నారు.

ఉత్తమ బీఎల్వోగా లక్ష్మి

గుమ్మలక్ష్మీపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉత్తమ బీఎల్వోగా గుమ్మలక్ష్మీపురం సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి అల్లక లక్ష్మి ఎంపికయ్యారు. ఈసందర్భంగా శనివారం ఆమెకు తోటి సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు అభినందనలు తెలిపారు.

సారా స్థావరాలపై దాడులు

కురుపాం/ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కురుపాం మండలంలోని పొడ్డిస, పూతికవలస గ్రామాల్లో శనివారం కురుపాం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ట్యూబుల్లో నిల్వచేసిన 120 లీటర్ల సారాతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ఎక్సైజ్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ఉపాధి ఏపీవోగా తులసీదాస్

జియ్యమ్మవలస, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం మండల ఏపీవోగా ఈగల తులసీదాస్ నియమితులయ్యారు. ఈయన భామిని మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. శనివారం స్థానిక ఎంపీడీవో శంబంగి రమేష్‌కు జాయినింగ్ ఆర్డర్‌ను అందజేశారు. ఇంతవరకు ఇక్కడ ఏపీవోగా పనిచేసిన కలిశెట్టి శ్రీనివాసరావుకు భామిని మండలానికి బదిలీ చేశారు.

తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ

పాలకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని అన్ని వార్డుల్లో తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్, కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. వారు శనివారం ఉదయం కస్పా వీధిలో పర్యటించారు. ఆ ప్రాంత వాసులు పలు సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.

ఓటు వజ్రాయుధం

ఒడిశా

రాయగడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటు వజ్రాయుధం అని, దానిని వినియోగించుకోవాలని కలెక్టర్ పారుల్ పట్వారి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా అదనపు కలెక్టర్ నిహార్ రంజన్ కహార్, సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి పాల్గొన్నారు. తొలుత నూతన ఓటర్లతో స్థానిక సమితి కార్యాలయం నుంచి బిజూ పట్నాయక్ ఆడిటోరియం వరకు ర్యాలీ చేశారు.



గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో నేత్ర వైద్య సేవల కోసం కేటాయించిన గది

కంటి పరీక్షలు లేవు.. శస్త్రచికిత్సలు చేయరు

- మూతపడిన ముఖ్యమంత్రి ఐ కేంద్రాలు
- ఇదీ ఉమ్మడి జిల్లాలోని ఆస్పత్రుల్లో పరిస్థితి

గజపతినగరం జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సీహెచ్‌సీల్లో కంటి వైద్య పరీక్షల ప్రక్రియ నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందిపడుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో నేత్ర రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు సీహెచ్‌సీల్లో ముఖ్యమంత్రి ఐ కేంద్రాలను ఏర్పాటుచేశారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలతోపాటు కంటి అద్దాలను అందజేసేవారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని గజపతినగరం, విజయనగరం, చీపురుపల్లి, బాడంగి, కురుపాం, పార్వతీపురం, బొబ్బిలి సీహెచ్‌సీల్లో ముఖ్యమంత్రి ఐ కేంద్రాలను ఏర్పాటుచేశారు. గతఏడాది సెప్టెంబరు నాలుగో తేదీ నుంచి కంటి పరీక్షలు, శస్త్రచికిత్సల సేవలు నిలిపివేశారు. గజపతినగరం సీహెచ్‌సీల్లో నియోజకవర్గం పరిధిలోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, సాలూరు నియోజకవర్గంలోని మెంటాడ మండలాల్లోని నేత్ర రోగులు వైద్యపరీక్షలు నిర్వహించి, కళ్ల జోళ్లను అందజేసేవారు. సీహెచ్‌సీల్లో ఐ కేంద్రానికి ప్రత్యేక గదిని ఏర్పాటుచేసి లక్షలాది రూపాయలతో పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. రోగులకు పరీక్షలు అనంతరం వారి ఆధార్ కార్డు, ఫోన్‌నెంబర్‌ఆధారంగా వారికి రెండు లేదా మూడు రోజుల్లో కళ్లజోళ్లను అందించేవారు. ఐ కేంద్రాల ద్వారా ఏటా ఏడు వేలమందికి పైగా సేవలందించేవారు. ప్రస్తుతం ఈ సేవలు నిలిచిపోవడంతో కంటి శస్త్రచికిత్సల కోసం విజయనగరం, విశాఖపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రులకు కంటి రోగులు ఆశ్రయిస్తున్నారు.ఆసుపత్రులో నేత్ర సేవలు నిలిపి వేయడంతో రోగులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం

గత ఏడాది సెప్టెంబరు నాలుగో తేదీన ముఖ్యమంత్రి ఐ కేంద్రాల సేవలు నిలిపివేసినట్లు గజపతినగరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీష్ తెలిపారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు నేత్ర వైద్య సేవలు కొనసాగిస్తామని చెప్పారు. ప్రస్తుతం ప్రథమ చికిత్సలు అందజేస్తున్నామని తెలిపారు.

మొబైల్ ఎక్స్‌రే ఏర్పాటు

రాజాం, జనవరి25 (ఆంధ్రజ్యోతి): రాజాం ప్రాంతీయ ఆసుపత్రిలో మొబైల్ ఎక్స్‌రే శనివారం ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ఆరుబయటే ఎక్స్‌రే మిషన్ శీర్షికతో కథనం ప్రచురితంకావంతో జిల్లా అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు ఆధ్వర్యంలో పాత ఎక్స్‌రే యంత్రం స్థానంలో ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. ఎక్స్‌రే ఏర్పాటు చేయడంతో బెడ్ పేసెంట్ల అవస్థలు తీరనున్నాయి. దీనిని ఎక్కడికైనా తీసుకువెళ్లడానికి అవకాశముంటుందని హరిబాబు తెలిపారు.



ఎక్స్‌రే మిషన్ ఏర్పాటుచేస్తున్న దృశ్యం

నేడు మద్యం విక్రయిస్తే చర్యలు

భోగాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భోగాపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ పరిధిలో గణతంత్రదినోత్సవం పురస్కరించుకుని ఆదివారం మద్యం అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్ శనివారం తెలిపారు.ఎక్కడైనా మద్యం దుకాణాలు, బార్లు తెరవబడవని, డ్రైడేగా పాటించనున్నట్లు పేర్కొన్నారు.

29న రాజాంలో జాబ్‌మేళా

రాజాం, జనవరి25(ఆంధ్రజ్యోతి): రాజాంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 29న ప్రభుత్వం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి గల నిరుద్యోగ యువత తమ వివరాలను హెచ్‌టిటిపిఎస్// ఎన్ఎపియుఎస్‌వైఎఎం, ఎపి, జీవోటి, ఐఎన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. అడ్మిట్ కార్డుతో పాటుగా రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్‌తో జాబ్‌మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు.

28న నెల్లిమర్లలో..

నెల్లిమర్ల, జనవరి25(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల సీకేఎం ప్రభుత్వ కాలేజ్, నిమ్స్ హాస్పిటల్‌లో ఈనెల 28న ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీకేఎం ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీజీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, ఎంఫార్మసీ, బి.ఫార్మసీ, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన 18నుంచి 35 సంవత్సరాల వయస్సుగల విద్యార్థులు హాజరుకావచ్చని పేర్కొన్నారు.

9న రాజాంలో ప్రజ్ఞా పరీక్ష

రాజాం, జనవరి 25(ఆంధ్రజ్యోతి):రాజాం ప్రభుత్వోన్నత పాఠశాలలో శనివారం ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి తొమ్మిదో తేదీన నిర్వహించనున్న ప్రజ్ఞా పరీక్ష కరపత్రాలను ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, పి.రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల్లో పరీక్ష భయాన్ని పోగొట్టడానికి మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు.పరీక్షల్లో ప్రతిభకనబరిచిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు పాల్గొన్నారు.

28న ఈపీఎఫ్ పెన్షనర్ల సదస్సు

గరివిడి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కేఎల్‌పురం ప్రజాసంఘాల కార్యాలయంలో ఈనెల 28న ఈపీఎఫ్ 98వ పెన్షనర్ల జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా నాయకులు ఎ.గౌరినాయుడు తెలిపారు. గరివిడిలో సదస్సుకు సంబంధించిన కరప త్రాలను జె.విశ్వనాథ రాజు, కంది రామారా వు, సలీమ్ తదితరుల ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కనీస పెన్షన్ పెంపుదల కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేద ని, నిధులలేవన్న కారణంగా పెంచలేకపో తున్నామని ప్రధాని మోడీ ప్రకటించడం దారుణమన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి):పారా లీగల్ వలంటీర్లకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ న్యాయాధి కారి కె.శారదాంబ ఒక ప్రకటనలో కోరారు. పదోతరగతి చదివిన నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణచేసిన వారు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, ఫిజీషియన్లు, విద్యార్థులు, రాజకీయాలతో సంబంధంలేని సేవాదృక్పథం గల వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వారికి జీతభత్యాలు, పారితోషికం ఉండదని తెలిపారు. ఈనెల 30న కోర్టుప్రాంగణంలోకి దరఖాస్తుదారులు హాజరుకావాలని కోరారు.

గరివిడిలో మాజీ మంత్రులు

గరివిడి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గరివిడి క్యాంపుకార్యాలయంలో మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీలు శనివారం వైసీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశంనిర్వహించారు.కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమానికి వితరణ

కొత్తవలస, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కొత్తవలస-కె.కోటపాడు రోడ్డులోని ఆంజనేయపేటలో గల చైతన్య దివ్యాంగుల ఆశ్రమానికి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు చెందిన పీవీ రమేష్ రూ.65 వేల విలువైన సరుకు లు అందజేసినట్టు నిర్వాహకుడు బోజంకి సన్యాసిరావు తెలిపారు. రమేష్ తండ్రి అప్పారావు జ్ఞాపకార్థం సరుకులు పంపిణీ చేశారని పేర్కొన్నారు.

బొబ్బిలి ఎమ్మెల్యేపై లోకాయుక్తకు ఫిర్యాదు

- ల్యాండ్ సీలింగ్ భూములు తీసుకున్నారని ఆరోపణ

విజయనగరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) ల్యాండ్ సీలింగ్ భూములను తమ వద్ద నుంచి బలవంతంగా తీసుకొని ఇళ్ల స్థలాలుగా మార్చుకొని అమ్ముకుంటున్నారని లోకాయుక్తకు మల్లమ్మపేట గ్రామస్థులు ఫిర్యాదుచేశారు. బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలోని మల్లమ్మపేటకు చెందిన ఏడు కుటుంబాలకు 1991లో సీలింగ్ భూమిని ప్రభుత్వం ఒక్కక్కరికి ఎకరా భూమి చొప్పున పంపిణీ చేసిందని, వాటిని సాగు చేసుకుని జీవిస్తున్నామని గ్రామస్థులు ఫిర్యాదులో పేర్కొన్నారు. గొల్లపల్లి రెవెన్యూకు చెందిన వీఆర్వో గొట్టాపు సింహాచలం సెటిల్‌మెంట్ రికార్డులను రాజులకు అనుకూలంగా మార్పు చేశాడని ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. లోకాయుక్తలో తాము వేసిన కేసు దర్యాప్తు పూర్తయి, తీర్పును వెలువరించే వరకు తమకు రక్షణ కావాలని వారు కోరారు. తమవద్ద నుంచి తీసుకున్న భూములను ప్లాట్లుగా మార్చుకుని అమ్మకాలు చేపట్టారని, ఆ అమ్మకాలను నిలుపుదల చేసేవిధంగా ఆదేశాలివ్వాలని కోరారు.

రికార్డులు పరిశీలించుకోవచ్చు : బేబీనాయన

తమకు ప్రజాబలం ఉండడంతో కొంతమంది బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. భూ రికార్డులను ఎవరైనా, ఎప్పుడైనా పరిశీలించుకోవచ్చని చెప్పారు. భూమికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. కొంతమంది డబ్బులు అడిగారని, వాస్తవానికి గతంలోనే అన్ని రకాల సెటిల్‌మెంట్లు అయిపోయాయని, ఇప్పుడు ఇలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు.



లోకాయుక్తకు ఫిర్యాదుచేసింది ఈ భూములపైనే..

ఆ సర్వే నెంబర్లలో ఇందిరమ్మకాలనీ...

మల్లమ్మపేటగ్రామస్థులు ఆరోపిస్తున్న సర్వేనెంబర్ల 631, 632,633లోగల భూముల్లో ప్రస్తుతం ఇందిరమ్మకాలనీ నివాసాలుఉన్నాయని బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ ఎస్ రామ్మోహనరావు తెలిపారు.కాలనీ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం 2006-07లో ఆ భూములను సేకరించిందని చెప్పారు.అప్పట్లో సాగుచేసుకుంటున్న రైతుల నుంచి కాలనీ నిర్మాణం కోసం సేకరించినట్లు రికార్డులు చెబుతున్నాయని, పరిహారంగా చెల్లించడంతోపాటు, ఇళ్లస్థలాలు ఇచ్చినట్లు ఆధారాలు ఉన్నాయని చెప్పారు.

ఎన్నికల హామీలను నెరవేర్చండి

- డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్



థాలీ బజావో కార్యక్రమం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విజయనగరం రింగురోడ్డు/కలెక్టరేట్, జనవరి25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు (డీసీసీ) మరిపి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ వద్ద పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు థాలీబజావో కార్యక్రమంలో భాగంగా డీసీసీ ఆధ్వర్యంలో ప్లేట్లు, స్పూన్లతో శబ్దం చేస్తూనిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై 227 రోజులుగడిచినా ఇప్పటివరకు పింఛన్లు, గ్యాస్‌పథకం తప్పా మిగతా హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. మేనిఫేస్టోలో చెప్పిన హామీలు అమలు చేయకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్లు గేదెల తిరుపతిరావు, సతీష్, ఓబీసీ చైర్మన్ సురేష్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల అడ్డగింత



చినకొండ్రాజుపాలెం గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ పాపారావు

భోగాపురం, జనవరి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండ్రాజుపాలెం నుంచి చోడిపల్లిపేట మధ్యలో నిర్మించనున్న బీటీ రహదారి పనులు చినకొండ్రాజుపాలెం గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. పెదకొండ్రాజుపాలెంనుంచి చోడిపల్లిపేట వరకు గతంలో రెండుసార్లు గ్రావెల్‌రోడ్డు నిర్మించారు. ఈనేపథ్యంలో ఇటీవల బీటీ రహదారి మంజూరుచేయడంతో క్లియరెన్స్ పనులు చేపడుతున్నారు. అయితే కొందరు స్థానికులు ఆ రహదారి స్థలం జీరాయతీకి చెందినదని పనులను అడ్డుకున్నారు. ఈ సమాచారం తెలుసుకొన్న ఎస్ఐ వి.పాపారావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికులతో మాట్లాడారుగతంలో ఉన్న రహదారిపైనే వేస్తున్నారని నూతనంగా ఏర్పాటుచేయడం లేదని, ఈవిషయాన్ని స్థానికులు గమనించాలని అవగాహన కలిగించారు. సమస్య రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

వల్లంపూడిలో ఎడ్లబండ్ల పోటీలు

వేపాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వల్లంపూడిలో సాంబమూర్తి తీర్థమహోత్సవం శుక్ర, శనివారాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లంపూడి, వేపాడ గ్రామస్థులు ప్రత్యేక మొక్కులు చెల్లించారు. శనివారం సాయంత్రం ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహించారు. పోటీల్లో 16 ఎడ్లబండ్లు పాల్గొనగా నిర్వాహకులు విజేతలకు నగదుబహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రుద్ర అంజలి, రుద్ర వెంకటరావు పాల్గొన్నారు.



పోటీలో పరుగుతీస్తున్న ఎడ్లబండి

నేటి నుంచి మరిడిమాంబ తీర్థమహోత్సవం

మరిడిమాంబ అమ్మవారి తీర్థమహోత్సవం ఆది, సోమ ,మంగళవారాల్లో నిర్వహించనున్నట్లు సర్పంచ్ బల్లంకి వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్లంకి, బానాది, ఎం.సింగవరం, నీలకంఠరాజపురం ,పెదగుడిపాల, భర్తవానిపాలెం, చినగుడిపాల, బీటీకేరాజపురం, తదితర తొమ్మిది గ్రామాల ప్రజలు మరిడిమాంబ అమ్మవారి తీర్థమహోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మూడు రోజులు పాటు బండ్ల వేషాలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్‌లు,రేలారే రేలా కార్యక్రమాలు, గయోపాఖ్యానం యుద్ధ సీను, 27న బుర్రకథ, విశాఖనాయుడు ఈవెంట్స్ వారితో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, 28న ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహించనున్నారు.

వృద్ధుల గొప్పతనాన్ని చాటి చెప్పాలి

- లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ

జామి, జనవరి25 (ఆంధ్రజ్యోతి):నేటి తరానికి వృద్ధుల గొప్పతనాన్ని చాటి చెప్పాలని లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ కోరారు. శనివారం మండలంలోని అట్టాడలోగల బీఎస్‌ఆర్ ఆశ్రమంలో నిర్వాహకులు బిశెట్టి శారాద వెంకటలక్ష్మి, శిరీష హరితసాయి ఆధ్వర్యంలో వృద్ధులకు అందజేస్తున్న సేవలను పరిశీలించారు.



జామి: మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ

- కొత్తవలస, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్టులను ప్రోత్సహించాలని లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని మంగళపాలెంలో గల గురుదేవ చారిటబుల్ ట్రస్టులో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రంతోపాటు, గురుదేవ ఆసుపత్రి, క్యాన్సర్ ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేకంగా ఆసుపత్రి ఏర్పాటుచేయడంపై గురుదేవ ట్రస్టు చైర్మన్ రావర్తి జగదీష్‌బాబును అభినందించారు. అనంతరం దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేశారు. ట్రస్టు ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను జగదీష్‌బాబు వివరించారు. ఆయన వెంట లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ తదితరులు ఉన్నారు.

32 ఆధార్ అప్‌డేషన్ కేంద్రాలు: కమిషనర్

విజయనగరం రింగురోడ్డు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని 32 ఆధార్ అప్‌డేషన్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఆధార్ కేంద్రాల పనితీరుపై సిబ్బంది, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు.

పింఛన్లు రద్దు చేస్తారన్న ఆరోపణలు నమ్మవద్దు

పింఛన్లు రద్దు చేస్తారన్న ఆరోపణలు నమ్మవద్దని, కేవలం పునః పరిశీలన జరుగుతోందని నగరపాలకసంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. శనివారం విజయనగరంలోని ప్రభుత్వసర్వజన ఆసుపత్రి వద్ద నిర్వహిస్తున్న ఎన్టీయార్ భరోసా దివ్యాంగుల పింఛన్ల పున పరిశీలన కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం కేంద్రాసుపత్రిలో నిర్మిస్తున్న శౌచాలయాన్ని తనిఖీచేశారు.

శతశాతం లక్ష్యాలు చేరుకోవాలి

రేగిడి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలు శతశాతం రుణ, రికవరీ లక్ష్యాలు చేరుకోవాలని ఏపీఎం గోవిందరావు కోరారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వెలుగు వీఓఏలు,సీసీలతో సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీనిధి ఓడీలు ఉండకూడదని, ఉల్లాస్ సమావేశాలు నిర్వహించి శతశాతంఅక్షరాస్యత చేరుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న గోవిందరావు

తోకలవలసలో పశు వైద్యశిబిరం

రేగిడి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోకలవలస, మునకవలసలో శనివారం నిర్వహించిన పశువైద్యశిబిరాన్ని రాజాం సబ్‌డివిజన్ పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయప్రకాశ్, పశు వైద్యాధికారులు దుర్గాప్రసాద్, వి.రాం ప్రారంభించారు. ఈ సందర్భంగా 300 పశువులు, గొర్రెలు, మేకలకు ఉచితంగా టీకాలు, నట్టల నివారణ వ్యాక్సీన్లు వేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, జనార్దనరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

- బొండపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పాడిపశువుల సంరక్షణ కోసమే పశు ఆరోగ్య శిబిరాలను గ్రామాల్లో నిర్వహిస్తున్నట్టు బొండపల్లి, రాచకిండాం, పశు వైద్యాధికారులు కిరణ్‌కుమార్, లక్ష్మీదీపిక తెలిపారు. మండలంలోని ముద్దూరు, వేండ్రాం గ్రామాల్లో శనివారం వైద్య శిబిరాలను నిర్వహించారు.పాడి పశువులతోపాటు గొర్రెలు, మేకలు, పశువులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మునకాల పైడిపునాయుడు, కర్రోతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించాలి: ఎంపీడీవో



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రాజాం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు కోరారు. శనివారం గురవారం గ్రామ సచివాలయాన్ని సందర్శిం చారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా, చెత్తను సంపద కేంద్రాలకు తరలించడ,విద్యుత్‌సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.విధులకు సకాలంలో హాజరుకావాలని ఆదేశించారు.

మూర్తి మృతి తీరని లోటు

రాజాం రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వామపక్ష నాయకుడు వీజీకే మూర్తి మృతి ప్రజా పోరాటాలు, ప్రజాతంత్ర కమ్యూనిస్ట్ ఉద్యమాలకు తీరని లోటని కార్మిక సంఘ నాయకుడు రామ్మూర్తి నాయుడు తెలిపారు. శనివారం పట్టణంలో మూర్తి సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో చిరంజీవి, నారాయుడు, రమణ, రాంబాబు, శేషు, రాము, శ్రీను, సింహాచలం పాల్గొన్నారు.

బకాయిల వసూలుకు తీర్మానం

కొత్తవలస, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బకాయిలను వసూలు చేసేందుకు నోటీసులివ్వాలని కొత్తవలస పంచాయతీలో తీర్మానించారు.శనివారం కొత్తవలస పంచాయతీ సర్వసభ్య సమావేశం సర్పంచ్ మచ్చ రామస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీకి రావలసిన ఆదాయ వనరులపై చర్చించారు. 2025-26 సంవత్సరానికి షాపింగ్‌కాంప్లెక్స్ షాపులను బహిరంగ వేలం వేయడం లేదా రెన్యువల్ చేయడానికి సంబంధించి కలెక్టర్ ఆమోదానికి తీర్మానించారు. పంచాయతీ పరిధిలో 70 లక్షల వరకు ఇంటిపన్నుల బకాయిలు ఉండడంతో వసూలు చేయడానికి చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులకు సంబంధించి 2024-25 సంవత్సరానికి 94 లక్షల 70 వేల రూపాయల బకాయిలు ఉన్నాయని పంచాయతీ ఈఓ శైలజ తెలిపారు.కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీదేవి పాల్గొన్నారు.

పశువులు తరలిస్తున్న వాహనాలు సీజ్

దత్తిరాజేరు,జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం సమీపంలో పశువులను అక్రమంగా తరలిస్తున్న నాలుగు వాహనాలు శనివారం పట్టుకున్నట్లు పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు.వాహనాలు తనిఖీల్లో భాగంగా ఎటువంటి పత్రాలు లేకుండా నాలుగు వ్యాన్లలో 23 పశువులను తరలిస్తున్నట్టు గుర్తించినట్లు చెప్పారు. వీటిని అలమండ, గుంటూరు ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వ్యాన్లను సీజ్‌చేసి డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

- గజపతినగరం జనవరి25:(ఆంధ్రజ్యోతి):పశువులను అక్రమంగా తరలిస్తున్న రెండువాహనాలను సీజ్‌చేసినట్లు ఎస్ఐ కె.లక్ష్మణరావు శనివారం తెలిపారు.సమాచారంమేరకు స్థానిక జాతీయరహదారిపై వాహనాలుతనిఖీలు చేస్తుండగా పెదమానాపురం నుంచి విజయనగరం వైపు వెళ్తున్న ఒకవాహనంలో 10, మరోవాహనంలో తొమ్మిది పశువులను తరలిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. పట్టుబడినవాహనాలు సీజ్‌చేసి నిందితులపై కేసు నమెదుచేశామని తెలిపారు.

110 మద్యం సీసాల స్వాధీనం

గజపతినగరం జనవరి25:(ఆంధ్రజ్యోతి)మండలం లోని మరుపల్లి జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న110 మద్యం సీసాలను స్వాధీనంచేసుకున్నట్లు ఎస్ఐ కె.లక్ష్మణరావు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై 110 మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బంది సహాయంతో దాడి చేసినట్లు చెప్పారు. పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

చంపావతి వంతెన వద్ద 69 సీసాలు..

గజపతినగరంలోని చంపావతి వంతెన వద్ద 69 మద్యం సీసాలు స్వాదీనం చేసుకన్నట్లు ఎస్ఐ కె.లక్ష్మణరావు శనివారంతెలిపారు. బొండపల్లి మండలంలోని దేవుపల్లికి చెందిన జె.వెంకటరమణ ద్విచక్రవాహనంపై మద్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు చంపావతి వంతెన వద్ద జాతీయరహదారిపై దాడిచేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

వియ్యంపేటలో గడ్డివాము దగ్ధం

కొత్తవలస, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వియ్యంపేటలో శనివారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డివాము దగ్ధమైంది. గడ్డివాముకు నిప్పంటుకుని మంటలు రావడంతో స్థానికులు గమనించి కొత్తవలసలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటనాస్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ. 20 వేల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. గ్రామానికి కొద్ది దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో ప్రమాదం ఎలా జరిగిందనే విషయం తెలియరాలేదు. ఎవరైనా పొగ తాగి అటువైపు చుట్టగాని, సిగరెట్టుగాని పడేయడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు.

సీబీసీఎన్‌సీ ఆస్తులపై విచారణ జరపాలి

విజయనగరం క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అన్యాక్రాంతమైన సీబీసీఎన్‌సీ ఆస్తులపై సీబీసీఐడీతో విచారణ జరపాలని ట్రస్ట్ చైర్మన్ ఆర్ఎస్ జాన్ డిమాండ్‌చేశారు. శనివారం విజయనగరంలోని ఎస్ఎంబీచర్చిలో 70వ సర్వజనీన మహాసభ నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1975లో మద్రాస్ హైకోర్టుతీర్పుతో సీబీసీఎన్‌సీ ట్రస్ట్ అసోసియేషన్‌కు ఆస్తులు బదలాయించినట్లు తెలిపారు. ఇవి 1979 వరకు వివాదం లేకుండా కొనసాగాయని తెలిపారు. స్వార్థపరులైన బాప్టిస్ట్ నేతలు ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నారని, వాటినికాపాడాల్సిన బాధ్యత సంస్థకు ఉందని తెలిపారు. సమావేశంలో టి.ఆనందరావు, శరత్‌కుమార్, వై.ప్రభాకర్, బాలచందర్ పాల్గొన్నారు.


దివ్యాంగులకు కళ్లజోళ్ల పంపిణీ

విజయనగరం కలెక్టరేట్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) రోటరీక్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు అందించడం అభినందనీయమని ఎంఎస్ఎంఈ ,సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలో 35వ జిల్లా రోటరీసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రోటరీక్లబ్ అధ్వర్యంలో 50 మంది దివ్యాంగులకు కళ్లజోళ్ల పంపిణీచేశారు.

ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలి

గుర్ల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటుచేసుకోవాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ నాయకుడు బి.సన్యాసినాయుడు కోరారు.శనివారం గుర్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద రైతులతో సమావేశం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో డాన్ స్వచ్ఛంద సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ సయ్యద్ అలీ, నెలిమర్ల మునిసిపల్ కమిషనర్,మండల కోఆర్డినేటర్ శాంతి, జమున, అప్పలనాయుడు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థిక పురోభివృద్ధే లక్ష్యం: మంత్రి



వెంగళరాయసాగర్‌లో చేప పిల్లలను విడిచిపెడుతున్న సంధ్యారాణి

సాలూరు రూరల్/ మక్కు. వ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. సాలూరు మండలం ముచ్చర్లవలస వద్ద వెంగళరాయ సాగర్‌లో 24.75 లక్షల చేప పిల్లలను పెంపకానికి విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దాదాపు రూ.40 లక్షల విలువైన చేప పిల్లలను ప్రభుత్వం గిరిజన మత్స్యకారుల ఉపాదికి వెంగళరాయసాగర్‌లో విడిచిపెట్టామని తెలిపారు. కార్యక్రమంలో సాలూరు, మక్కువ మండలాల టీడీపీ అధ్యక్షులు ఆముదాల పరమేశు, గుల్ల వేణుగోపాలరావుపాల్గొన్నారు.

వీధి మధ్యలో విద్యుత్ స్తంభం

రేగిడి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునకవలసలో ఓ వీధి మధ్యలో విద్యుత్‌స్తంభం ఏర్పాటు చేయడంతో గ్రామస్థులకు అవస్థలు తప్పడం లేదు. ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించడానికి వీల్లేకుండా పోయింది. జనావాసాల్లో విద్యుత్ స్తంభం ఉండడంపై పలుసార్లు అధికారులు ఫిర్యాదుచేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇటీవల ఉపాధి నిధులతో సీసీ రోడ్డు మంజూరుచేసినా, స్తంభాన్ని అలాగే ఉంచి రోడ్డు వేశారని గ్రామస్థులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి స్తంభాన్ని రోడ్డు మధ్య భాగంలో నుంచి తొలగించి, రోడ్డు పక్కన ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.



వీధిమధ్యలో ఉన్న విద్యుత్‌స్తంభం